క్లుప్తంగా

మోదీ మూడోసారి ప్రధానమంత్రి కావాలి


ప్రచారం చేస్తున్న నాయకులు

సుల్తానాబాద్: నరేంద్ర మోదీ మూడోసారి దేశ ప్రధాని కావాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు ఆకాంక్షించారు. ఆదివారం మున్సిపల్ పరిధిలో ఉన్న శాస్త్రినగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పట్టణాలు అభివృద్ధి చెందాయని, అవినీతి, బంధుప్రీతి లేకుండా పరిపాలన కొనసాగిస్తోందన్నారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు భూసారపు సంపత్, పట్టణ ప్రధాన కార్యదర్శి గజభీకార్ పవన్ కుమార్, గుడ్ల వెంకటేశ్, బీజేవైఎం కార్యదర్శి బుర్ర సతీశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పల్లె తిరుపతి, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు మారవేని రమేశ్, కార్యదర్శులు పోచంపల్లి ఈశ్వర్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన షేక్ సాహెరా హాజీ పాషాకు రూ.47వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు. ఆదివారం వెంకట్రావుపల్లి కాంగ్రెస్ నాయకులు చాట్ల సదానందం, బెల్లంకొండ విజేందర్‌రెడ్డి శనిగరం తిరుపతి బాధితుడికి అందజేశారు.

గర్రెపల్లిలో బీజేపీ ఇంటింటా ప్రచారం


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

సుల్తానాబాద్‌రూరల్: పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరుతూ సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జెట్టి శ్రీనివాస్, మహేశ్ గౌడ్, ప్రవీణ్, ప్రభాకర్ ఉన్నారు.

జీలకుంటలో పోచమ్మతల్లి బోనాలు


బోనంతో బీజేపీ నాయకుడు సదయ్యగౌడ్

ఓదెల: మండలంలోని జీలకుంటలో పోచమ్మ తల్లి బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గీత కార్మికులు పోచమ్మ, ఎల్లమ్మ తల్లులను దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు ఏగోలపు సదయ్యగౌడ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి కొల్లూరి పృథ్వీరాజ్, అగ్గి శ్రీనివాస్ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ఎన్నికల సన్నాహక సమావేశం

జూలపల్లి: మండల కేంద్రంలోని గోల్డెన్ ఫంక్షన్ హాలులో కాంగ్రెస్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ సీనియర్ నాయకులు లోక జలపతి రెడ్డి తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నిర్వహించనున్న సమావేశానికి ఎమ్మెల్యే విజయరమణారావుతో పాటు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

నేడు మండలస్థాయి సమావేశం

ఎలిగేడు: మండల కేంద్రంలోని మధుర ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉదయం 11గంటలకు కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పామాయిల్ సాగు విస్తీర్ణం పెరిగేనా?

- క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు సూచనలిస్తున్న అధికారులు
- జిల్లాలో 1,112 ఎకరాల్లో సాగు
- గతేడాదితో పోల్చితే తగ్గిన విస్తీర్ణం.. పెరిగిన రైతులు


అంతర్గాంలో సాగవుతున్న పామాయిల్

రామగుండం: వంటనూనెల వినియోగానికి సరిపడా ఉత్పత్తి లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం పామాయిల్ దిగుమతి చేసుకుంటోంది. దిగుమతులకు అత్యధిక వ్యయం చెల్లించాల్సి రావడంతో రాష్ట్రంలోనే పామాయిల్ సాగు ఉత్పత్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రైతులను ప్రోత్సహిస్తూ వివిధ రకాల సబ్సిడీలను అందజేస్తూ ప్రతి ఏటా పామాయిల్ సాగు విస్తీర్ణం పెంపుపై ప్రత్యేక దృష్టిసారిస్తోంది. ఇందులో భాగంగానే ఉద్యానవనశాఖ అధికారులతో ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షల పేరుతో క్షేత్రస్థాయిలో సాగు విస్తీర్ణం పెంపు దిశగా కసరత్తు చేస్తోంది.

సస్యరక్షణ చర్యలు..

ప్రస్తుతం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో మొక్కల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉండడంతో నూతనంగా సాగు చేసే రైతులకు ఉద్యానవనశాఖ అధికారులు పలు రకాల సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచనలు, సలహాలిస్తున్నారు.

- మూడేళ్లలోపు గత ఆయిల్‌పామ్ తోటల్లో మొక్కకు మూడు అడుగుల దూరంలో జనుము పచ్చిరొట్ట ఎరువు పంటగా నాటుకోవాలి. పూతకు వచ్చిన జనుమును వెంటనే చిన్న ముక్కలుగా కట్ చేసి పామాయిల్ మొక్క మొదళ్లలో వేయాలి.
- ప్రతీ మొక్కకు ఇరువైపులా ఒక్క మైక్రోజెట్ (గరిష్ఠంగా గంటకు 40 లీటర్లు డిశ్చార్జి అయ్యే పైపులు) అమర్చుకోవాలి.
- ప్రస్తుత సీజన్‌లో మూడేళ్లలోపు ప్రతీ మొక్కకు గరిష్ఠంగా 165 లీటర్ల నీటిని అందించాలి. మూడేళ్లు దాటిన ప్రతీ మొక్కకు గరిష్ఠంగా 330 లీటర్ల నీటిని అందించాల్సి ఉంటుంది.
- మూడేళ్లలోపు వయసు గల మొక్కలకు వచ్చే పూగుత్తులను నెలలో రెండుసార్లు అబ్లేషన్ సాధనంతో తొలగించాలి.
- పామాయిల్ తోటల్లో అంతర పంటలు వేస్తే అధికారుల సిఫార్సు మేరకు తప్పనిసరిగా సాగు నీరందించాలి.
- ఆయిల్‌పామ్ రైతులు ఉద్యానవన అధికారుల సిఫారసు చేసిన పద్ధతి మేరకు పోషకాలను అందించాల్సి ఉంటుంది.
- ఎదిగిన తోటల్లో గెలలు కోసిన తర్వాత, నరికి ముక్కలు చేసిన ఆకులను, మగ పూల గుత్తులను మొక్క మొదళ్లలో పరచాలి.
- పామాయిల్ తోటల్లో పక్వానికి వచ్చిన గెలలను అల్యూమినియం కడ్డీ, లేదంటే కత్తిని వినియోగించి కోయాలి.
- ఎదిగిన తోటలకు నెలకు 5కేజీల యూరియా, 3కేజీల డీఏపీ, 5కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 2.5 కేజీల మెగ్నీషియం సల్ఫేట్, కేజీ బోరాక్స్‌ను విడివిడిగా నీటిలో కరిగించి ఫెర్టిగేషన్ సాయంతో మొక్కలకు అందించాలి.

తగ్గిన సాగు విస్తీర్ణం..

2022–23తో పోల్చితే 2023–24లో సాగు దిగుబడి తగ్గినప్పటికీ సాగు రైతుల సంఖ్య మాత్రం పెరిగింది. 2022–23లో జిల్లాలో అత్యధికంగా పామాయిల్ ముత్తారం మండలంలో 295 ఎకరాలలో 93 మంది రైతులు సాగు చేస్తున్నారు. 2023–24లో ధర్మారం మండలంలో 138 ఎకరాల విస్తీర్ణంలో 66 మంది రైతులు సాగు చేస్తున్నారు. కాగా 2022–23లో జిల్లా వ్యాప్తంగా సాగు విస్తీర్ణం 1,252 ఎకరాలు కాగా 415 మంది రైతులున్నారు. 2023–24లో సాగు విస్తీర్ణం 1,112 ఎకరాలు కాగా 482 మంది సాగు రైతులున్నారు. కాగా గడిచిన రెండేళ్లలో జిల్లాలోనే అతి తక్కువగా అంతర్గాం మండల పరిధిలో పామాయిల్ సాగవుతుండడంతో అధికారులు దీనిపై దృష్టిసారించారు.

దశలవారీగా దిగుబడి



ఇతర పంటలతో పోల్చితే దీర్ఘకాలికంగా నిరంతరం అంతగా దృష్టి సారించక పోయినా సాగు దిగుబడి దశల వారీగా వస్తుంటుంది. ప్రతీ ఏటా పామాయిల్ వినియోగం పెరుగుతుండడంతో బహిరంగ మార్కెట్‌లో పామాయిల్‌కు మంచి ధర పలుకుతోంది. నేను మూడు ఎకరాలలో సాగు చేస్తున్నాను. ఉద్యానవన అధికారుల ప్రోత్సాహం సంతృప్తికరంగా ఉంది.

– మల్క చొక్కారావు, మద్దిర్యాల రైతు

నష్టాలు తక్కువ



కొన్నేళ్ల పాటు నిరంతరం దిగుబడి ఆదాయం పొందాలంటే పామాయిల్ సాగుతోనే సాధ్యం. ఈ సాగులో నష్టాలతో రైతులు ఇక్కట్లు పడే అవకాశాలు తక్కువ. ఏ సీజన్‌లోనైనా కొంతమేర దృష్టి సారిస్తే సత్ఫలితాలు సాధించవచ్చు. మూడేళ్లలోపు మొక్కల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టిసారించాలి. నేను 8 ఎకరాల్లో సాగు చేస్తున్నా.

– అలుగువెల్లి సురేందర్‌రెడ్డి, బ్రాహ్మణపల్లి, రైతు

విస్తీర్ణం స్వల్పంగా తగ్గింది



జిల్లాలో అంతర్గాం మండల పరిధిలోనే అత్యల్పంగా పామాయిల్ సాగవుతోంది. దీనిపై ప్రత్యేక దృష్టిసారిస్తూ ప్రతీ గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నా. పామాయిల్ సాగు చేసే రైతులు ప్రత్యామ్నాయంగా ఇతరత్రా పనులు కూడా చేసుకునే వీలుంటుంది. జిల్లావ్యాప్తంగా 2023–24లో స్వల్పంగా సాగు విస్తీర్ణం తగ్గినప్పటికీ సాగు రైతుల సంఖ్య పెరగడం సంతృప్తినిచ్చింది.

– జక్కుల శ్రీకాంత్‌యాదవ్, ఉద్యానవనశాఖ అధికారి

గుండారంలో తాగునీటికి తిప్పలు


గుండారంలో నల్లా నీటి కోసం వేచి చూస్తున్న మహిళలు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామంలో కొన్నిరోజుల నుంచి తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామానికి తాగునీటి సరఫరా చేసే మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి పూర్తిస్థాయిలో నీటి సరఫరా కాకపోవడంతో పాటు గుండారం రిజర్వాయర్ సమీపంలోని ఓపెన్‌వెల్ బావిలో నీటిమట్టం తగ్గిపోవడంతో తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వాడలకు రోజువారీగా తాగునీటి సరఫరా చేస్తున్న సరిపోవడం లేదని మహిళలు పేర్కొంటున్నారు. గ్రామంలోని చేతి పంపులు పని చేయకపోవడంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. రిజర్వాయర్ సమీపంలోని ఓపెన్‌వెల్ బావిలో పూడిక, చేతి పంపులకు మరమ్మతు చేపడుతున్నామని, తాగునీటి సమస్య లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.


చేతి పంపునకు మరమ్మతు చేస్తున్న గ్రామస్తులు

కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పొట్యాల మాజీ సర్పంచ్ నీరజ బీఆర్‌ఎస్ నుంచి ఆదివారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ సర్పంచుతో పాటు గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన వంద మందిని కాంగ్రెస్‌లో చేరారు. మండల ఇన్‌చార్జి పెండ్రు హన్మాన్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, కోఆర్డినేటర్ గాదె సుధాకర్, అధికార ప్రతినిధి మడ్డి తిరుపతిగౌడ్, బర్పటి శ్రీనివాస్, కిరణ్‌కుమార్‌గౌడ్, సంతోష్ ఉన్నారు.

నేడు లక్ష్మీనరసింహుని శకటోత్సవం

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శకటోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని ఐదు గ్రామాల రైతులు తమ ఎడ్లబండ్లతో ఆలయం ఉన్న గుట్ట చుట్టూ తిప్పి, ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లిస్తారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీని ఢీకొన్న బస్సు


ధ్వంసమైన బస్సు వెనకభాగం

ముత్తారం: నిత్యం వందలాది ఇసుక లారీలు, పలు వాహనాలతో రద్దీగా ఉండే మండల కేంద్రమైన ముత్తారం–అడవిశ్రీరాంపూర్ చౌరస్తా నుంచి ఓడెడ్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఇసుక లారీలు నిలపగా.. ఆదివారం ఓ ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అడవిశ్రీరాంపూర్ చౌరస్తా నుంచి ముత్తారంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే ప్రధాన రోడ్డుపై ఇసుక లారీలు ఓ మెడికల్ షాప్ దుకాణం వద్ద డీడీల ప్రింట్ కోసం నిలపడంతో.. వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. డీడీ కోసమని నడి రోడ్డు మీద నిలిపిన లారీని తప్పించబోయిన ఆర్టీసీ బస్సు వెనకభాగం తగిలి ధ్వంసమైంది. బస్సులో వెనకభాగంలో ప్రయాణికులు లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పిందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక క్వారీలో పని చేసే వ్యక్తి డీడీలు తీసే వ్యక్తితో కుమ్మక్కయి డీడీలు అక్కడే తీసుకోవాలని ఆదేశించగా.. రోడ్డుపై లారీలు నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆక్రమించుకొని వెలిసిన దుకాణాలతో రోడ్డు ఇరుగ్గా మారి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సై మధుసూదన్‌రావు తమ సిబ్బందిని సంఘటనా స్థలం వద్దకు పంపడంతో గొడవ సద్దుమణిగింది. కానిస్టేబుల్ అశోక్ నిలిచిన వాహనాలను పంపించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ధర్యపూర్‌లో ఇసుక క్వారీ నిర్వాహకులు రోడ్డుపై నీరు చల్లడం లేదని స్థానికులు లారీలను ఆపారు. పోలీసులు వెళ్లి లారీలను పంపించారు.

ఐదు డివిజన్లకు అధ్యక్షుల నియామకం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని ఐదు డివిజన్లకు సంబంధించిన అధ్యక్షులను ఆదివారం కాంగ్రెస్ కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ ప్రకటించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆదేశాల మేరకు 15వ డివిజన్ అధ్యక్షుడిగా సాగర్‌కుమార్, 16వ డివిజన్‌కు దాసరి రాజిరెడ్డి, 17వ డివిజన్ కిషన్ నాయక్, 18వ డివిజన్ మార్కరాజు, 19వ డివిజన్‌కు తిరుపతిరెడ్డిని నియమించినట్లు రాజేశ్ పేర్కొన్నారు.

ఇద్దరిపై పిచ్చికుక్క దాడి


ఎలిగేడు: నర్సాపూర్ గ్రామంలో ఆదివారం పిచ్చి కుక్క ఇద్దరిపై దాడి చేసింది. గ్రామానికి చెందిన మెరుగు శ్రీరామ్(5) అనే బాలున్ని కరవడంతో.. తలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే గ్రామానికి చెందిన రాధారపు వెష్ణవి కాలును కరిచింది. వెంటనే ఇద్దరిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా.. శ్రీరామ్‌ను పరీక్షించిన వైద్యులు వరంగల్ ఎంజీఎంకు వెళ్లాలని సూచించినట్లు తెలిసింది.

నియామకం



సుల్తానాబాద్‌రూరల్: సర్వాయి పాపన్న గీతకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుల్తానాబాద్ మండలం తొగర్రాయికి చెందిన బొంగోని సదయ్యగౌడ్‌ను నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడు శనివారం కోడూరి పర్శరాంగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. గీతకార్మిక సంఘం బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని సదయ్యగౌడ్ పేర్కొన్నారు.

గుంత తవ్వారు.. పూడ్చడం మరిచారు


ప్రమాదకరంగా ఉన్న గుంత

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీరాంపూర్ క్రాస్‌రోడ్ సమీపంలో రోడ్డుపై గుంతలు తీసి మున్సిపల్ సిబ్బంది వదిలివేశారు. పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు చేయడానికి మున్సిపల్ సిబ్బంది గుంతలు తవ్వారు. ఇక్కడి వరకు బాగానే ఉంది. లీకేజీ మరమ్మతు చేసిన వెంటనే పూడ్చి వేయాలి. కానీ పూడ్చకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతను వెంటనే పూడ్చివేయాలని కోరుతున్నారు.

పంచాహ్నిక నవరాత్రోత్సవాల ముగింపు


వేడుకల్లో పాల్గొన్న భక్తులు


శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం

రామగుండం: అబాది రామగుండంలో స్వయంభూగా వెలిసిన 200 ఏళ్ల క్రితం నాటి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో పంచాహ్నిక నవరాత్రి వేడుకలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ (శ్రీరామనవమి) భద్రాచలం పూజారి రామాచార్యుల ఆధ్వర్యంలో ఐదురోజుల నుంచి నిర్విఘ్నంగా ఆలయ ప్రాంగణంలో హోమాలు, నాగవెల్లి, సదస్యం వేడుకలు నిర్వహించారు. చివరిరోజు శ్రీసీతారామచంద్రస్వామి వారిని గ్రామంలో ప్రాచీన రథంపై ఊరేగింపు నిర్వహించారు. అర్ధరాత్రి వరకు పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి మారుపాక రాజేందర్‌శర్మ, సేనాపతి రామాచార్యులు, కమ్మల నారాయణశర్మ ఉన్నారు.

ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడికి సన్మానం


సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

జ్యోతినగర్: గోదావరిఖనిలో ఐఎన్‌టీయూసీ మహాసభలకు హాజరవుతున్న ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డిని ఆదివారం సన్మానించారు. ఎన్టీపీసీ రామగుండం జ్యోతిభవన్‌కు చేరుకున్న సందర్భంగా యూనియన్ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా, మినిమం వేజ్‌బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, ఎన్టీపీసీ రామగుండం ఉద్యోగ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్, కందుల స్వామి పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి ఆర్‌డి చంద్రశేఖర్, సత్యనారాయణరెడ్డి, భూమల్ల చందర్, పూసాల తిరుపతి, జ్యోతిక రిక్రియేషన్ క్లబ్ కార్యదర్శి మేరుగు రాజనర్సయ్య, కొలని వెంకటరెడ్డి, బాదె అంజయ్య, కాసర్ల వెంకటస్వామి, సమ్మిరెడ్డి, నేరెళ్ల రమేశ్ పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం


పారాయణం చేస్తున్న హనుమాన్ భక్తులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామంలో ఆదివారం మాలధారణ భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. నూతనంగా వచ్చే మాలధారణ భక్తుల సౌకర్యార్థం నూతనంగా ఆలయ ప్రాంగణంలో చాలీసా శ్లోకాల బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేయాలి

ధర్మారం: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపే లక్ష్యంగా సేవాదళ్ కార్యకర్తలు, నాయకులు క్రియాశీలకంగా పనిచేయాలని సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొల్లి స్వామి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వంశీకృష్ణ గెలుపు కోసం సేవాదళ్ నాయకులు క్షేత్రస్థాయిలో పోలింగ్ బూతుల వారీగా ప్రచారం కోసం ప్రణాళిక రూపొందించుకోవాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డి గెలుపులో ప్రముఖ పాత్ర వహించాలన్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. బీజేపీ కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతూ రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అన్ని వస్తువులపై ధరలు పెంచి సామాన్యులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ నాయకులు దేశాయ్‌నాయక్, లక్ష్మణ్, నరేశ్ పాల్గొన్నారు.

ముగిసిన బొడ్రాయి వేడుకలు


కథ చెప్తున్న బైండ్ల పూజారులు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న పూసాలలో బొడ్రాయి భూలక్ష్మి, మహాలక్ష్మి, పోచమ్మ వేడుకలు ముగిశాయి. ఆదివారం కాలనీలో పట్నంతో బైండ్ల పూజారులు కథ చెప్పి ముగించారు. మాజీ జెడ్పీటీసీ గుర్రాల మల్లేశం, కోట రంగారెడ్డి, పురం ప్రేంచందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర మౌనిక, శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వలస నీలయ్య, కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్, చిలుక సతీశ్, పురం రమణ, అలుగువెల్లి తిరుపతిరెడ్డి, కొయ్యడ రమేశ్, చొప్పరి సుమన్, వేగోళం శంకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు సిద్ధ తిరుపతి, కంకణాల ఆశాలు, ఆగండ్ల శంకర్, మత్స్య పారిశ్రామిక శాఖ సంఘం మాజీ చైర్మన్ ఉస్తెం రవి, కంకణాల తిరుపతి, మత్స్యశాఖ సంఘం డైరెక్టర్ కంకణాల సతీశ్, పురం హరికిషన్, మత్స్యశాఖ సంఘం డైరెక్టర్ ఉస్తెం లక్ష్మీనారాయణ, బుర్ర సురేశ్, గుర్రాల కిరణ్, మాజీ సర్పంచ్ లంక శంకర్ కలువల శ్రీను, తమ్మనవేణి సతీశ్, మల్లారెడ్డి, గడ్డం అంజి, బుర్ర సునీల్, వడాల శేఖర్, పూసాల సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు మోక్షమెన్నడు?


కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు

రామగుండం: ప్రతీ ఏటా వర్షాకాలంలో అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి–ఆకెనపల్లి గ్రామాల మధ్య లోలెవల్ వంతెనపై వరదనీరు పొంగడంతో పదుల సంఖ్యలో గ్రామాలకు అంతర్గాం మండల కేంద్రంతో రాకపోకలు బంద్ అయ్యేవి. నాన్‌ప్లాన్ నిధులు రూ.2.35 కోట్లతో గతేడాది సెప్టెంబర్ 2న అప్పటి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఏడునెలలైనా నిర్మాణం పూర్తికాలేదు. వర్షాకాలం వచ్చేలోపు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.